ప్రజాశక్తి
మంగళవారం 30 సెప్టెంబర్ 2025

5న కవి సమ్మేళనం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగర ఉత్సవాలలో భాగంగా అక్టోబర్ ఐదో తేదీన మహారాజా లేడీస్ అండ్ రిక్రియేషన్ క్లబ్‌లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వేదిక కన్వీనర్ డాక్టర్ జి.జనార్దన్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విజయనగరం జిల్లా పరిధిలోని కవులతో స్వీయ కవితా పఠనం నిర్వహిస్తున్నామని చెప్పారు. కవితలు తెలుగు సాహిత్యాన్ని ప్రతిబింబించేలా ఉండాలని తెలిపారు. దేశభక్తి, సామాజిక స్పృహని పెంపొందించే విధంగా ఉండాలని, ప్రభుత్వ వ్యతిరేక విషయాలపై కవిత్వం ఉండరాదని సూచించారు. కవి సమ్మేళనంలో పాల్గొనదలిచినవారు తమ స్వీయ కవితలను ఒక పేజీకి మించకుండా రాసి వాట్సాప్‌లో పంపాలని కోరారు. పూర్తి వివరాలకు చీకటి దివాకర్ (9441176882), సముద్రాల గురుప్రసాద్ (9490462262), భోగరాజు సూర్యలక్ష్మి (9440117116)ను సంప్రదించాలని సూచించారు.

బీడుగా మారిన భూములివే

నాడు పంట పొలాలు.. నేడు బీడు భూములు

ఉద్యోగాలు, నష్టపరిహారం, పునరావాసం ఇలా ఎన్నో ఆశలు చూపించిన ఆల్ఫా ఇన్‌ఫ్రా కంపెనీ.. అమాయక గిరిజనులు, రైతులను అడుగడుగునా మోసం చేసింది. 15 ఏళ్లు గడిచినా కంపెనీ ఏర్పాటు చేయలేకపోయింది. ఇందుకోసం ప్రయత్నించిన అడ్డుదారులు ముందుకు సాగకపోవడమే ఇందుకు కారణం. కానీ, విలువైన భూములు మాత్రం వశపరుచుకుంది. ఇందుకోసం అడుగడుగునా గిరిజన చట్టాలను ఉల్లంఘించింది. చివరికి ప్రభుత్వ అనుమతికి మించిన భూములు కూడా లాగేసుకుంది. దీంతో నిత్యం పచ్చదనంతో తొణికిసలాడే పంట భూములు నేడు బీడువారాయి. సాగునీటి ప్రాజెక్టు పనులు కూడా అర్థాంతరంగా నిలిచిపోయాయి.

- అడుగడుగునా చట్టాల ఉల్లంఘన
- ఆపై అక్రమ కేసులు, బెదిరింపులు
- థర్మల్ పవర్ ప్లాంట్ పేరిట ఆల్ఫా ఇన్‌ఫ్రా కంపెనీ మాయాజాలం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/కొమరాడ

థర్మల్ పవర్ ప్లాంట్ పేరిట కొమరాడ మండలంలోని పెదఖేర్జల, చినఖేర్జల, కోటిపాం, శివరాంపురం, రేగులపాడు పంచాయతీల పరిధిలోని వందలాది ఎకరాలను ఆల్ఫా ఇన్‌ఫ్రా కంపెనీ సేకరించిన సంగతి తెలిసిందే. అందులో అడుగడుగునా మోసాలే కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తొలుత 640.75 ఎకరాల భూమిని సేకరించారు. ఆ తరువాత అప్పటి అధికారులు అత్యుత్సాహంగా వ్యవహరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే (జిఒ పరిధిని దాటి) ఆల్ఫా ఇన్‌ఫ్రా కంపెనీ పేరున 485.31 ఎకరాలు అదనంగా సేకరించారు. తద్వారా వనకాబడి సాగునీటి ప్రాజెక్టు ఆయకట్టు భూమంతా కంపెనీ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఫలితంగా ఆ ప్రాజెక్టు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

వాస్తవానికి ఈ ప్రాజెక్టును 2009లోనే రూ.6.66 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టారు. 1037.82 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనేది దీని లక్ష్యం. రెండేళ్లలో రూ.2.43 కోట్లు ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు ఖర్చుచేశారు. ఈలోపు 2010 నుంచి పవర్ ప్రాజెక్టు పేరిట భూసేకరణ మొదలు పెట్టారు. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు తీసుకెళ్లేందుకు జలవనరుల శాఖ అధికారులు వెనుకడుగు వేశారు. దీనికితోడు సేకరించిన భూముల చుట్టూ కంపెనీ యాజమాన్యం కంచె వేయడంతో సాగుచేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఈ భూముల్లో ఎక్కువగా వరి, మొక్కజొన్న, పత్తి వంటి వ్యవసాయ ఉత్పత్తులతోపాటు జీడి, మామిడి వంటి ఉద్యాన పంటలు సాగయ్యేవి. వీటితోపాటు మిగిలిన కొండ ప్రాంతంలో గిరిజనులకు జీవనాధారమైన అటవీ ఉత్పత్తులు పుష్కలంగా లభించేవి. దీంతో స్థానిక గిరిజనులు, రైతులు 2010 వరకు రాజుల్లా బతికేవారు. నేడు ఆయా భూములు కంపెనీ చెరలోకి వెళ్లడంతో బీడువారుతున్నాయి. నిర్వాసితులు పొట్టకూటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఆయా భూముల్లో కట్టెల కోసం వెళ్లినా, పశువుల మేతకు తీసుకెళ్లినా అక్రమ కేసులు బెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గిరిజనులు 'ప్రజాశక్తి' ఎదుట వాపోయారు.

వాస్తవానికి థర్మల్ పవర్ ప్రాజెక్టు పేరిట భూములు తీసుకున్న గ్రామాలన్నీ ఐదో షెడ్యూల్ పరిధిలోకి వస్తాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి ప్రభుత్వ భూములు విక్రయించడం గానీ, కొనుక్కోవడం గానీ రాజ్యాంగ విరుద్ధం. చివరికి నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ యాక్టు -2006)ను కూడా ఉల్లంఘించారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం... నిర్వాసితుల ఒత్తిడి మేరకు స్థానిక తహశీల్దార్ వివరణ కోరినప్పటికీ సంబంధిత కంపెనీ యాజమాన్యం స్పందించలేదు. పైగా గిరిజనులే తమ ఆధార పత్రాలను దఖలు చేయాలంటూ బుకాయింపు చర్యలకు దిగిందట. తామే ఆధారాలు ఇవ్వాలని భావిస్తే కొంత సమయం కూడా ఇవ్వాలని కూడా కోరిందట. దీన్నిబట్టి అప్పట్లో చట్ట విరుద్ధంగా కేటాయించిన, కొనుగోలు చేసిన భూములను ఏదో ఒక విధంగా వశపర్చుకునేందుకు కంపెనీ యాజమాన్యం ప్రయత్నిస్తున్నట్టుగా అర్థమౌతోంది. 2013లో పర్యావరణ అనుమతులు రద్దుచేసిన వెంటనే భూములను తిరిగి సాగుదారులకు అప్పగించాల్సిన ప్రభుత్వం ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తోంది.

మహిళలు ఉన్నత స్థితికి చేరాలి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ • అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎమ్‌పి కలిశెట్టి, ఎమ్మెల్యే అదితితో కలిసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

మహిళలు మరింత ఉన్నత స్థితికి చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అఖిలభారత డ్వాక్రా బజార్ (సరస్ ఎగ్జిబిషన్)ను కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డితో కలిసి స్థానిక మాన్సాస్ గ్రౌండ్‌లో సోమవారం సాయంత్రం మంత్రి ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్త్రీనిధి ద్వారా 16,034 మంది మహిళా సంఘ సభ్యులకు రూ.145.94 కోట్ల చెక్కును ఈ సందర్భంగా పంపిణీ చేశారు. కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ జీవనోపాధులు పెంచడం ద్వారా మహిళలను ఆర్థికంగా వృద్ధిలోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. మహిళా సంఘాలు తాము తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు దోహదపడతాయని అన్నారు. సుమారు 244 స్టాళ్లను ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా సంఘాలు తాము తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం, నాబార్డ్, వివిధ రకాల బ్యాంకులు సహకారం అందిస్తున్నాయని చెప్పారు. చదువుకున్న మహిళలకు కూడా ఏదో విధంగా ఉపాధి కల్పించేందుకు లేదా వారిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి వెల్లడించారు. ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారని చెప్పారు. ప్రధాని సూచనలకు అనుగుణంగా అక్టోబరు 2న ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని కోరారు. సేంద్రీయ ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు మాట్లాడుతూ ఇలాంటి ఎగ్జిబిషన్స్ మహిళల ఎదుగుదలకు సహకరిస్తాయని చెప్పారు. వీటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు తరపున సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, ఎపిడి సావిత్రి, నాబార్డు డిడిఎం నాగార్జున, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, డిఆర్‌డిఎ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి జీతాలు, బిల్లులు చెల్లించాలని

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, నాయకులు

బకాయి ఉన్న మూడు నెలల బిల్లులు, జీతాలు వెంటనే చెల్లించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లలకు మెనూ ఛార్జి పెంచాలన్నారు. 9, 10వ తరగతి విద్యార్థులకు వంట చేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వాలని కోరారు. పథకాన్ని ప్రయివేటీకరణ చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనం పేరుతో జిల్లాలో మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించారని, వారికి ఉపాధి కల్పించాలని కోరారు. నాలుగు నెలల క్రితం పెరిగిన మెనూ ఛార్జీ బిల్లులో కలపాలన్నారు. గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్‌చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయాలని కోరారు. 12 నెలలకు వేతనం చెల్లించాలని, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, సంఘం జిల్లా అధ్యక్షులు బి.మంగలక్ష్మి బి.రామలక్ష్మి, ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్‌పితో చర్చిస్తున్న మంత్రి శ్రీనివాస్

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని దత్తి గ్రామంలో సిఎం చంద్రబాబు పర్యటన కోసం ఏర్పాట్లను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్‌తో కలిసి పరిశీలించారు. హెలిపాడ్ నుంచి ప్రజావేదిక వద్దకు, పింఛనుదారుల గృహాల వద్దకు ముఖ్యమంత్రి వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. వాహనాల పార్కింగ్, రాజకీయ ప్రతినిధుల సమావేశానికి ఏర్పాటు చేసిన హాల్‌ను, ముఖ్యమంత్రి విశ్రాంతి కోసం ఏర్పాటు చేస్తున్న గ్రీన్‌రూమ్‌ను తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పింఛను అందుకోనున్న లబ్ధిదారుల గృహాలను కూడా తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి సెక్యూరిటీ సిబ్బంది కూడా హాజరై ప్రోటోకాల్స్‌ను, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అనంతరం అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జెసి సేతు మాధవన్, అదనపు ఎస్‌పి సౌమ్యలత, తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 134 వినతులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అర్జీదారులతో మాట్లాడుతున్న డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి మొత్తం 134 వినతులు అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, మురళి, నూకరాజు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వాటిని పరిశీలించి, పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత సమయంలో వినతులకు పరిష్కారం చూపాలని డిఆర్‌ఒ ఆదేశించారు. వచ్చిన వినతుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు 63 అర్జీలు అందాయి. ఇతర శాఖలకు సంబంధించి మిగిలినవి వచ్చాయి.

జ్ఞాన సరస్వతి ఆలయంలో సోమవారం నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. చిన్నారులు, తల్లిదండ్రులతో ఆ ప్రాంతమంతా కళకళలాడింది. - ప్రజాశక్తి, విజయనగరంకోట

హెచ్‌ఐవిపై అవగాహన కల్పించాలి

కంటోన్మెంట్ : జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని డిఎంహెచ్‌ఒ ఎస్.జీవన రాణి తెలిపారు. సోమవారం డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద సమగ్ర ఆరోగ్య ప్రచార రథాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. 15 రోజులు జిల్లాలో ప్రజా సమూహ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి కె.రాణి పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్‌లో 40 పతకాలు

విజయనగరం టౌన్: గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగిన 38వ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు 40 పతకాలు సాధించారు. అందులో 15 బంగారు, 12 రజతం, 13 కాస్యం ఉన్నాయి. జిల్లా నుండి 74 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. బెస్ట్ అథ్లెట్ ఎం.దివ్యవాణి నిలిచింది. బాలికలు ఓవరాల్ గర్ల్స్ ఛాంపియన్‌షిప్ సాధించారు. పతకాలు సాధించిన జిల్లా అథ్లెట్లకు జాయింట్ సెక్రెటరీ ఎ.రాఘవేంద్ర, ఎఎఫ్ఐ హైమ, డిఎన్ఆర్ కళాశాల పీడీ నరసింహారావు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.లీలాకృష్ణ, జి.శ్రీకాంత్ అభినందనలు తెలిపారు.

సాధించిన పతకాలతో క్రీడాకారులు

ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే పనులు చేయం

కమిషనర్‌కు సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఇంటింటికి వెళ్లే విధులు గాని తమకు అప్పగించవద్దని సచివాలయ ఉద్యోగులు సోమవారం కమిషనర్ నల్లనయ్యకు వినతి అందించారు. ఈ విషయమై ఇప్పటికే ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు అధికారిక వాట్సాప్ గ్రూపుల నుండి వైదొలగాలని నిర్ణయించినట్లు చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఆరోగ్యకర అలవాట్లతో

గుండె సమస్యలకు దూరం / ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ర్యాలీలో పాల్గొన్న ఎస్‌పి దామోదర్, వైద్యులు

ఆరోగ్యకరమైన అలవాట్లతో గుండె సంబంధిత సమస్యలకు దూరంగా ఉండవచ్చని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. 'వరల్డ్ హార్ట్ డే' సందర్భంగా తిరుమల-మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నగరంలో సోమవారం ర్యాలీ చేపట్టారు. కోట జంక్షన్ నుంచి తిరుమల-మెడికవర్ ఆసుపత్రి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని యువతను కోరారు. మనం ఆరోగ్యంగా ఉంటే మన కుటుంబ సభ్యులు కూడా ఆనందంగా ఉంటారన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, అటువంటి జీవన విధానం ప్రతిఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిరుమల - మెడికవర్ ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, మాన్సాస్ ఇఒ కె.వి.ఎల్.పి.రాజు, కార్డియాలజిస్టు శరత్‌చంద్ర, దుర్గా ప్రసాద్, కిరణ్, మెడికవర్ సెంటర్ హెడ్ మల్లికార్జున రెడ్డి, డిఎస్‌పి ఆర్.గోవిందరావు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ పండగను

సమన్వయంతో విజయవంతంగా చేయాలి

- మేయర్ విజయలక్ష్మి
- 10 అంశాలకు ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

అందరి సమన్వయంతో పైడితల్లమ్మ పండగను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. మొత్తం 10 అంశాలను అజెండాలో పొందుపరచగా, సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా పైడితల్లమ్మ జాతర నేపథ్యంలో నగరపాలక సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు వివరించారు. సమావేశ అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పైడితల్లమ్మ జాతర నేపథ్యంలో ఇప్పటికే రహదారుల మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. వీధి దీపాలు శతశాతం వెలిగేలా కృషి చేస్తున్నామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సిరిమాను తిరిగే సమయంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతిస్తూ 900 మంది కార్మికులను ఏర్పాటు చేశామన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ పండగ మూడు రోజులూ తాగునీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణిక్య, జివి రంగారావు, సుంకర నారాయణస్వామి, రేగాన రూపాదేవి, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు పాల్గొన్నారు.

'సీతం'లో సిఎటిసి-5 ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక సీతం కళాశాలలో విశాఖపట్నం గ్రూపు కమోడోర్ సుమంత్ రాయ్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తపస్ మండల్ ఆధ్వర్యంలో సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం - 5 (సిఎటిసి-5) ఘనంగా ప్రారంభమైంది. ఈ శిబిరం పది రోజులపాటు కొనసాగనుంది. శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం జిల్లాలకు చెందిన సుమారు 600 మంది ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు. కేడెట్లలో జాతీయ భావన, క్రమశిక్షణ, సమాజ సేవా భావాలను పెంపొందించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని డిప్యూటీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ గుంట ముక్కల భద్రయ్య తెలిపారు. సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో సీతం కళాశాల ప్రిన్సిపల్ డివి రామ్మూర్తి, ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ ప్రశాంత్, లెఫ్టినెంట్ కృష్ణ కిషోర్, లెఫ్టినెంట్ లక్ష్మి, లెఫ్టినెంట్ మణికంఠ, సిటిఒ సతీష్, వాసు, సౌమ్య, సిఎస్‌ఒ సత్యనారాయణ, పీడీ మహేశ్వర పాల్గొన్నారు.

ఫిర్యాదులపై చట్ట పరిధిలో చర్యలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అర్జీలు స్వీకరిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

పిజిఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులపై చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని మహిళా పోలీసుస్టేషన్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు.. పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్‌లో ఆయన వినతులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో కాన్ఫరెన్సులో మాట్లాడి, వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, చట్ట పరిధిలో ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. పిజిఆర్ఎస్‌లో 30 ఫిర్యాదులు అందాయి. భూతగాదాలకు సంబంధించి 13, కుటుంబ కలహాలపై 2, నగదు వ్యవహారాలపై 3, ఇతర అంశాలపై 12 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డిసిఆర్‌బి ఎస్ఐ ప్రభావతి పాల్గొన్నారు.

కార్యకర్తల కోసం డిజిటల్ బుక్

మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అన్యాయానికి గురవుతున్న వైసిపి కార్యకర్తల కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. సోమవారం నగరంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైసిపి ముఖ్యనాయకులతో కలిసి డిజిటల్ బుక్ యాప్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వైసిపి కార్యకర్తా డిజిటల్ బుక్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనిని రెండు రకాలుగా ఉపయోగించవచ్చని, మొదటిగా మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి జరిగిన అన్యాయం పట్ల వివరాలను, ఆధారాలను నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. రెండోది మొబైల్ ఫోన్ ద్వారా 040- 49171718 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నమోదు అయిన ఫిర్యాదులన్నీ డిజిటల్ బుక్‌లో నిక్షిప్తమై ఉంటాయన్నారు. సమావేశంలో విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, మండల అధ్యక్షులు కెల్లా త్రినాథరావు, ఫ్లోర్‌లీడర్ ఎస్.వి.వి రాజేష్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మేయర్, నాయకులు

లోక్ కల్యాణ్ మేళా ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో సోమవారం లోక్ కళ్యాణ్ మేళాను కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రారంభించారు. ముందుగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. డిజిటల్ లావాదేవీల ప్రక్రియను గమనించారు. అనంతరం జరిగిన సమావేశంలో వీధివిక్రయదారులకు గుర్తింపు కార్డులను, ధృవీకరణ పత్రాలను అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. గతంలో ఉత్తమ ఫలితాలు సాధించిన కారణంగా పిఎం స్వనిధి అవార్డును అందుకున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దుప్పాడ సునీత, లీడ్ బ్యాంకు మేనేజర్ మూర్తి, ఫుడ్ సేఫ్టీ అధికారి మీరా, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్, టిపిఆర్‌ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ హుండీ ఆదాయం రూ.16,75,917

విజయనగరం టౌన్ : పైడితల్లమ్మ దేవస్థానంలో చదురగుడి హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.16,75,917 నగదు, బంగారం 14 గ్రాములు, వెండి 301 గ్రాములు వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ శిరీష తెలిపారు.

అవయవదానంతో ప్రాణదానం

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ దేవిమాధవి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఒకరి అవయవదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ బి.దేవి మాధవి అన్నారు. సోమవారం ప్రభుత్వం మెడికల్ కళాశాలలో స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవయవ దానం ద్వారా గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు మొదలైన అవయవలోపాలతో బాధపడుతున్న రోగుల జీవితాలను కాపాడవచ్చని తెలిపారు. దానం చేసిన కార్నియాలతో అనేకమందికి కంటి చూపులు ఇవ్వవచ్చునన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి మరణాంతరం అవయవాలను దానం చేయడం ద్వారా అనేకమందికి నూతన జీవితాలను ఇవ్వవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ జెడ్.శరత్ బాబు, ఎస్ఎన్ఎస్‌పిఎ పిఒ ఎన్.ఝాన్సీ, వైస్ ప్రిన్సిపల్ బి.సుదర్శి, కెఎస్ సరోజినీ దేవి పాల్గొన్నారు.

అవయవదానం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు, విద్యార్థులు

గుండెపోటుతో ఎస్ఐ మృతి

శ్రీనివాసరావు (ఫైల్)

ప్రజాశక్తి - పూసపాటి రేగ

పూసపాటిరేగ పోలీస్ స్టేషన్‌లో రెండో ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావు(50) సోమవారం విజయవాడలో గుండెపోటుతో మృతి చెందారు. శ్రీనివాసరావు విజయవాడలో దసరా ఉత్సవాలకు బందోబస్తుగా వెళ్లారు. అక్కడ బాత్‌రూమ్‌లో ఉంటుండగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. శ్రీనివాసరావు కుటుంబానికి పోలీసులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



నిరాహార దీక్షలు చేస్తున్న నిర్వాసితులు

నిరాహార దీక్షలు ప్రారంభం

శృంగవరపుకోట: 100 రోజులుగా వివిధ రూపాల్లో బొడ్డవర వద్ద ఆందోళన నిర్వహించిన జిందాల్ నిర్వాసితులు సోమవారం నుంచి నిరాహారదీక్షలు ప్రారంభించారు. రోజుకి 9 మంది చొప్పున నిర్వాసిత అన్ని గ్రామాల నుంచి ఈ దీక్షలో పాల్గొంటామన్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ మోసపూరితంగా తమ వద్ద నుంచి తీసుకున్న భూమిని వెంటనే తిరిగి ఇవ్వాలని, ఉద్యోగాలు, కంపెనీలో వాటా రూపంలో షేర్లు ఇస్తామని చెప్పి కంపెనీ కట్టకుండా అదే భూమిని ఇతర పారిశ్రామిక రియల్ ఎస్టేట్‌గా మార్చుకొని అమ్ముకునేందుకు సిద్ధపడ్డ జిందాల్ యాజమాన్యం పై ప్రభుత్వం చర్య తీసుకోవాలన్న డిమాండ్లతో ఈ దీక్ష ప్రారంభించినట్టు తెలిపారు. జిందాల్ మోసానికి ప్రభుత్వ అధికారుల మౌనానికి వ్యతిరేకంగా నిరాహార దీక్షలకు పూనుకున్నామన్నారు. తమకి న్యాయం జరిగే వరకూ దీక్షలు కొనసాగుతాయని హెచ్చరించారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన

వేపాడ: మండలంలోని బోజంకివానిపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా వేపాడ పశువైద్యాధికారి డాక్టర్ కోరాడ గాయత్రి మాట్లాడుతూ 20 పశువులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. గ్రామంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు కూడా వేశామన్నారు. పశువులు ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముర్రుపాలను అప్పుడే పుట్టిన పెయ్యలకు దూడలకు పట్టడం వల్ల కలిగే లాభాలు, వర్షాకాలంలో పశువులు, జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో సర్పంచ్ బోజంకి రామునాయుడు, గోపాలమిత్ర బోజంకి సింహాద్రప్పడ, పశువైద్య సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

5వేల మందికి అన్నదానం

నెల్లిమర్ల: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక థామస్‌పేట స్టేజ్ వీధి వద్ద సోమవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 5వేల మంది ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. దుర్గాదేవి శరన్నవరాత్రి వేడుకలు ఏటా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు 15వ వార్డు కౌన్సిలర్ కళ్యాణం సత్యనారాయణ, తీడ శ్రీను తెలిపారు.

బుడా చైర్మన్ పదవీ కాలం పొడిగింపు

బొబ్బిలి: బొబ్బిలి అర్బన్ డవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పదవీ కాలం పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుడా చైర్మన్‌గా తెంటు లక్ష్మునాయుడుని గతేడాది నవంబర్ 12న నియమించారు. పదవీ కాలం ఏడాది నుంచి మూడేళ్లకు పెంచుతూ సోమవారం జిఒ 892ను జారీ చేశారు. ఇప్పటి నుంచి మరో రెండేళ్లు బుడా చైర్మన్‌గా లక్ష్మునాయుడు కొనసాగనున్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

భోగాపురం: పూసపాటిరేగ మండలంలోని పూసపాటిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సోమవారం సిఎం సహాయనిధి చెక్కులను ఎపి మార్కెఫెడ్ చైర్మన్, నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అందించారు. భోగాపురం మండలంలోని పోలిపల్లి గ్రామంలో తన నివాసం వద్ద ఈ చెక్కులను సోమవారం అందజేశారు. నడుపూరి రుక్మిణి రూ.31,624, రౌతు సత్యం రూ.28,699, రౌతు సత్యనారాయణకు రూ.1.35లక్షల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి సింహాచలం, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ దంగా భూలోక, పూసపాటిపాలెం సర్పంచ్ సోమినాయుడు, గుంపాం మాజీ సర్పంచ్ కొత్తకోట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

నెల్లిమర్ల: నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్తు అంతరాయం ఏర్పడనుందని ఆ విభాగం ఈఈ త్రినాధరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్లలో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా కొండగుంపాం, గరికిపేట, మొయిద, నారాయణపట్నం, పూతికపేట, చింతలపేట, పెదమజ్జిపేట గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అక్రమ మ్యుటేషన్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బాడంగి మండలం బాడంగి రెవెన్యూ పంచాయతీ, డొంకినవలస రెవెన్యూ పంచాయతీలో గల రైతులు దగ్గర తీసుకున్న మహావీర భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు గిరిజనులకు దళితులకు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. సోమవారం బొబ్బిలిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల కాలం నుండి ఎటువంటి నిర్మాణమూ చేయకుండా ఖాళీగా ఉన్న భూములపై కూటమి ప్రభుత్వ షాడో నేత కళ్ళు ఆ భూములు పైన పడ్డాయని ఆ భూమిని ఇప్పుడు కొంత మంది పేర్లపైన పోటాపోటీగా మ్యుటేషన్లు పెట్టి మార్చాలని ప్రయత్నాలు తీవ్రంగా జరుగుతున్నాయని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకొని పేద ప్రజలకి పంచాలని లేనిపక్షంలో మహావీర భూములపై దళిత గిరిజనులతో భూ పోరాటం చేస్తామని ఈ హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ నాయకులు వెంపల బాబ్జి, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ఇఎస్ఐలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గరివిడి

స్థానిక ఇఎస్ఐ ఆసుపత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని ఇఎస్ఐ ఆసుపత్రి ఫార్మసిస్ట్ బి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాన్నం 3 గంటల వరకు ఈ వైద్య శిబిరం ఉంటుందన్నారు. విశాఖపట్నం మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అన్ని రకాల ప్రముఖ వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని ఉచిత బీపీ, షుగర్ ఇతరత్రా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. గరివిడి చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఈ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

కనీస వేతనాలివ్వాలని నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఎఐటియుసి ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, ఎపి మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.స్రవంతి, బి.నారాయణమ్మ, బి.రామలక్ష్మి, వి.లక్ష్మి పాల్గొన్నారు.

డెంకాడ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్ సేఫ్టీ, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఎంవిజిఆర్ కళాశాల సహకారంతో 10 లార్జ్ సైజ్ స్టాపర్స్‌ను సోమవారం స్థానిక ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు, భోగాపురం రూరల్ సిఐ జి. రామకృష్ణతో కలిసి ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి- డెంకాడ

రైట్ రైట్..

- భోగాపురంలో ఆపని ఎక్స్‌ప్రెస్ బస్సులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ఆర్డినరీ బస్సుల్లో రద్దీతో మరిన్ని అవస్థలు

ప్రజాశక్తి- భోగాపురం

ఒకప్పుడు ప్రత్యేకమైన గుర్తింపు కలిగిన భోగాపురం నేడు ఆ గౌరవాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ గ్రామానికి ఎక్స్‌ప్రెస్ బస్సుల స్టాప్ నాటి కాలం నుంచే ఉండేది. మండల ప్రజలు సుదూర ప్రాంతాలకు ప్రయాణం చెయ్యాలంటే భోగాపురంలోనే ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆదరించాల్సి వచ్చేది. ఆ రోజుల్లోనే ప్రయాణికులు ఇక్కడే ఆర్డినరీ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా సులభంగా ఎక్కి దిగే వీలుండేది. అయితే జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గ్రామంలో పైవంతెన నిర్మించడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వైజాగ్ వైపు నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ బస్సులు హైవే నుంచి సర్వీస్ రోడ్డు మార్గాన భోగాపురం ఊరిలోకి రావాలంటే ఎనిమిది కిలోమీటర్లు ముందు ఉన్న పోలిపల్లి వద్ద కట్ అయ్యి రావాల్సి ఉంది. శ్రీకాకుళం వైపు నుండి వచ్చే బస్సులకు భోగాపురం ముందే సర్వీస్ రోడ్లోకి వచ్చేందుకు వీలున్నప్పటికీ అదే మార్గం గుండా సుమారు 15 కిలోమీటర్లు ప్రయాణించి విశాఖ జిల్లా, తగరపువలస వద్ద మాత్రమే మళ్లీ హైవే ఎక్కేందుకు వీలుంది. ఎక్కువ దూరం సర్వీస్ రోడ్డులో ప్రయాణించాల్సి రావడంతో ఎక్స్‌ప్రెస్ బస్సులు భోగాపురం ఊరిలోకి రాకుండా హైవే పైనుంచి వెళ్లిపోతున్నాయి.

ప్రస్తుతం గ్రామంలోకి వచ్చే సర్వీస్ రోడ్డులో కేవలం ఆర్డినరీ బస్సులు మాత్రమే ఆగుతున్నాయి. ఎక్స్‌ప్రెస్ బస్సులకు అధికారికంగా స్టాప్ ఉన్నప్పటికీ, అవి ఫ్లైఓవర్ మార్గంలోనే వెళ్లిపోతున్నాయి. మధ్యాహ్నం భోజనం సమయంలో మాత్రమే గ్రామ సమీపాన గల హోటళ్లవద్ద భోజనాలు కోసం ఆపి సర్వీస్ రోడ్ మీదగా వస్తున్నాయి. మిగతా సమయాల్లో అసలు సర్వీస్ రోడ్లకే ఎక్స్‌ప్రెస్ బస్సులు రావడం లేదు. రాత్రి సమయాల్లో విశాఖపట్నం నుంచి భోగాపురం రావాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్ కండక్టర్లను ఎంత బతిమిలాడినా బస్సు ఎక్కించటం లేదని ఒకవేళ ఎక్కించినా హైవే ఫ్లైఓవర్ మీదే దించేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో పిల్లలు మహిళలతో దిగాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. భోగాపురం మేజర్ పంచాయతీతో పాటు మండల హెడ్ క్వార్టర్ కావడంతో సుదీర ప్రాంతాల నుంచి ఉద్యోగులు రోజువారి విధులకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్ల వేళలా ఆర్డినరీ బస్సులు గ్రామం మీదగా వెళుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించడంతో అవి కూడా రద్దీగా ఉంటున్నాయి. ఫలితంగా ఉద్యోగులు, విద్యార్థులు, దినసరి కూలీలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం

ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయంలో ఎక్కడానికి బస్సులు దొరకక విద్యార్థులు, ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ప్రపంచ స్థాయి గుర్తింపు త్వరలో పొందబోతున్న భోగాపురం లాంటి ఊరుకి సరైన రవాణా సౌకర్యం లేక పోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తుంది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే గ్రామస్తులు అంతా కలిసి జాతీయ రహదారిపై బైఠాయిస్తామని యువకులు, ప్రజలు బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. సమస్యపై అధికారులు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

హోటళ్ల వద్ద భోజనాల కోసం ఆపిన ఎక్స్‌ప్రెస్ బస్సులు

ఇబ్బందులు తప్పడం లేదు

నేను భోగాపురం మండల పరిషత్ ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాను. ప్రతిరోజూ విశాఖపట్నం నుంచి భోగాపురం ఉద్యోగరీత్య ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఆర్డినరీ బస్సు ఎక్కుదామంటే అవి ఖాళీగా ఉండటం లేదు. ఎక్స్‌ప్రెస్ ఎక్కుదామంటే అవి భోగాపురంలో ఆపడం లేదు. ఒకవేళ ఆపిన గ్రామ శివారును గల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆపుతున్నారు. రోజు ప్రయాణం చేయడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం.

రోజా ఉద్యోగి, భోగాపురం

ఎక్స్‌ప్రెస్‌లు ఆపడం లేదు

నా చిన్నప్పటి నుంచి భోగాపురంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేవి. ఇప్పుడు ఆపడం లేదు. జాతీయ రహదారి పైనుంచి వెళ్ళిపోతున్నాయి. రాత్రి సమయాల్లో వైజాగ్ నుంచి గాని శ్రీకాకుళం నుంచి గాని భోగాపురానికి రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం.

- త్రినాథ్, భోగాపురం

కుక్కల నుంచి కాపాడండి మహాప్రభో..

- గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్న శునకాలు
- వీధులలో తిరిగేందుకు జంకుతున్న ప్రజలు
- పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

రోజు రోజుకూ శునకాలు జనంపై దాడులు చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రోడ్లపై, ఇళ్ల వద్ద, దుకాణాల్లో, వీధులలో కుక్కలు స్వైర విహారం చేస్తూ స్థానిక ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. కుక్కల నుండి రక్షించుకునేందుకు ప్రజలు పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తోంది. తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నా, నిత్యావసర సరుకులు, కూరగాయలు వంటివి తీసుకు రావడానికి వీధులలోనికి వెళ్లినా కుక్కలు ప్రజలను వెంటాడి తరుముతున్నాయి.

మండలంతో పాటు చీపురుపల్లి పట్టణంలో కూడా కుక్కలు భారీగా సంచరించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కుక్కల బెడదతో ఇంటి నుండి బయలకు అడుగు పెట్టాలంటేనే భయంగా ఉందంటూ స్థానికులు వాపోతున్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీలో కుక్కలు తండోప తండోపాలుగా తిరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆరోపిస్తున్నారు. గత కొంత కాలంగా చీపురుపల్లి పట్టణంలో ప్రజలను కుక్కలు కరుస్తున్నప్పటికీ అధికారలు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పట్టణంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేసి సుమారు 53 మందిన కరిచిన విషయం తెలిసిందే. అయితే వారందరూ చీపురుపల్లి ఏరియా ఆసుపత్రిలో వ్యాక్సినేషన్ వేయించుకున్నారు. అయినప్పటికీ రానున్న రోజులలో తమకి ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజుల క్రితం పట్టణంలో ఒకరిని కుక్క కరవడంతో ఆ వ్యక్తి మృతి చెందిన విషయం కూడా తెలిసి ప్రజలు మరింత భయాందోళనకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో విచ్చల విడిగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కుక్కల బారి నుండి స్థానిక ప్రజలను కాపాడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

జంతు ప్రేమికుల హెచ్చరికతో వెనుకడుగు

ఇది ఇలా ఉంటే కుక్కలు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నప్పటికీ అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. గతంలో కుక్కలపై చర్యలు తీసుకున్నప్పుడు కొంత మంది జంతు ప్రేమికులు అధికారులను హెచ్చరించినట్లు సమాచారం. దీంతో తమకెందుకులే అని అధికారులు కుక్కలు విచ్చల విడిగా గుంపులు గుంపులుగా తిరుగుతున్నప్పటికీ పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని సమాచారం. ఏది ఏమైనప్పటికీ కుక్కల బారి నుండి ప్రజలను, విద్యార్థులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- బొబ్బిలి

రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడు మృతదేహం రైల్వే పోలీసులు గుర్తించారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో అప్ లైన్లో సోమవారం రైలు పట్టాలు దాటుతుండగా, రైలు పైనుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. మృతుడు ఎరుపు రంగు గడుల షర్ట్, బ్రౌన్ రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతిని వివరాలు తెలిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే హెచ్.సి ఈశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని గరుడబిల్లి గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు ఇంటి వద్ద సోమవారం డిజిటల్ బుక్ ఆవిష్కరణ చేశారు. కు సంబంధించి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ క్లస్టర్ ఇంచార్జ్లు మహంతి రమణ, పల్లి రఘు, తాడ్డి చంద్ర రావు, నియోజకవర్గ రైతు విభాగపు అద్యక్షుడు సాలాపు పెంటంనాయుడు, మాజీ ఎంపిపి సుంకరి ఈశ్వర రావు పాల్గొన్నారు.

లోకం ప్రసాద్.. నోరు అదుపులో పెట్టుకో

మీడియా ప్రతినిధులను అగౌరవపరచడం సరికాదు : మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి- డెంకాడ

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి భర్త లోకం ప్రసాద్ నోరు అదుపులో పెట్టుకోవాలని, మీడియా ప్రతినిధులను అగౌరవపరచడం సరికాదని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన పినతాడివాడ సర్పంచ్ లంక లక్ష్మణరావు ఇంటి వద్ద విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విలేకర్లు తమపై కూడా వ్యతిరేక వార్తలు రాశారని, ఏనాడూ మీడియాను కించపరచలేదని అన్నారు. నీ భాగోతం ఎవరికీ తెలియనిది కాదని, తెస్తానన్న కంపెనీలు, ఇస్తామన్న ఉద్యోగాలు ఏవీ? అని ప్రశ్నించారు. కారు చౌకగా భూములు కొట్టేసి సామ్రాజ్యాన్ని విస్తరించి రాజకీయాల్లోకి వచ్చి ఆస్తులను కాపాడుకుంటున్నావని ఆరోపించారు. 15నెలల్లో నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. మరో మూడేళ్లలో కూడా నియోజకవర్గానికి ఏమీ చేయలేవని విమర్శించారు. నీ భార్య ఎమ్మెల్యే అయితే నీ పెత్తనం ఏమిటి? ప్రశ్నిస్తే దాడులు చేస్తావా? మీడియా ప్రతినిధులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నేను దొరగారి వద్ద పని చేయడం ఏంటి? మతి భ్రమించి మాట్లాడుతున్నావా, కీర్తిశేషులు అప్పడుదొరపై పోటీ చేసిందే మా కుటుంబం. నువ్వు స్థానికుడివి కావు, మా కుటుంబ చరిత్ర ఏమిటో తెలుసుకో, దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నాం, అంచలంచెలుగా ఎదిగాం, వేల కోట్లు ఉన్నోడివి పంచాయితీ పన్నులు ఎందుకు చెల్లించవు? అని లోకం ప్రసాద్‌ను ప్రశ్నించారు. యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఆరు నెలల గడువు ఇస్తున్నాం. హామీ అమలు చేయకపోతే నాలుగు మండలాల్లో భారీ స్థాయిలో ఉద్యమానికి దిగుతాం. మా కార్యకర్తలను వేధిస్తే చూస్తూ ఊరుకోం, అక్రమ కేసులు బనాయిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవు, అధికారులు కూడా అందుకు తగ్గట్టు నడుచుకోవాలని హెచ్చరించారు. ప్రతీది నోట్ చేస్తున్నామని, కావాలనే ఇబ్బందులకు గురి చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. నీ భూకబ్జాలపై, పంచాయతీలకు మీరు బకాయి పడిన పన్నులపై పాత్రికేయులు వార్తలు రాస్తే వారిని బెదిరించడం తగదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, వైసిపి భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, పతివాడ అప్పలనాయుడు, పిన్నింటి తమ్మి నాయుడు, నెల్లిమల్ల వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, వైసిపి నాయకులు కోరాడ కోటి నాయుడు, బుగత రమణ, పతివాడ కృష్ణవేణి, మహంతి శ్రీనివాసరావు, బడ్డుకొండ రామనాయుడు తదితరులు పాల్గొన్నారు

జాగ్రత్తలతోనే గుండె జబ్బుల నివారణ

ప్రజాశక్తి- బొబ్బిలి

ర్యాలీ చేస్తున్న వైద్యులు, రోటరీ ప్రతినిధులు, విద్యార్థులు

ముందస్తు జాగ్రత్తలతోనే గుండె సంబంధిత వ్యాధులను నియంత్రణ చేయవచ్చని అందుకు హృద్రోగ సమస్యలపై అవగాహన అవసరమని ప్రముఖ జనరల్ ఫిజిషియన్ ఎన్అర్ఐ హాస్పిటల్ రెసిడెంట్ వైద్యులు డాక్టర్ అభినయ్ అన్నారు. సోమవారం ప్రపంచ హృదయ దినోత్సవ నేపథ్యంలో కారుణ్య ఫౌండేషన్, రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గుండె సంబంధిత జబ్బులు, తీసుకోవలసిన జాగ్రత్తలపై సామాజిక అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అభినయ్ మాట్లాడుతూ చిన్న వయసు కలవారు కూడా గుండె జబ్బులు బారిన పడి ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగించే విషయం అన్నారు. క్రమబద్ధమైన జీవలశైలి లేకపోవటం, అధిక ఒత్తిడికి గురికావడం గుండె జబ్బులు బారిన పడుతున్నారన్నారు. ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యం, శారీరక శ్రమ లేకపోవటం, వీటికి తోడు ఊబకాయం, మధుమేహం, బిపిల బారిన పడటం కూడా గుండె జబ్బులు, మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఛాతి బరువు లేక నొప్పి, శ్వాస అందకపోవటం, చెమట పట్టటం, తలతిరగటం ఎడమ చేతికి లేక ఎడమ వైపు వెనుక భాగానికి గొంతు భాగానికి నొప్పి పాకినట్లు అనిపిస్తే దాన్ని గుండె నొప్పిగానే భావించి సమీప డాక్టర్ వద్దకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్ కేంద్రం డాక్టర్ సాయికుమార్, కారుణ్య, రోటరీ సభ్యులు, ఎన్అర్ఐ సిఇఒ సింద్రీ శ్రీనివాసన్, కె. రామకృష్ణ, ఏ.చిన్నా రావు, సోమేశ్వరరావు, వైద్య సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్వస్త్‌నారీ స్వశక్త్ పరివార అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖ, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 155 మంది మహిళలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలు అందించారు. మహిళలు, కిశోర బాలికలకు రక్తపోటు, మధుమేహం, కేన్సర్ స్క్రీనింగ్, రక్తహీనత, క్షయవ్యాధి, సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు, గర్భిణులకు ప్రసూతి పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, ఆయుష్మాన్ సేవలు ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ప్రమీల దేవి, డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ లక్ష్మీ శైలజ, డాక్టర్ శీతల్, డాక్టర్ సందీప్, సర్పంచ్ టొంపల సీతారాం, నాయకులు మహంతి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: గ్రామాలలో ప్రజలు ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం అవసరమని ఎఎంసి వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ అన్నారు. మండలంలోని గొట్లాంలో సోమవారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పి.సత్యనారాయణ, డి. సునీత. ఐసిడియస్ సూపర్‌వైజర్ ఎస్.పైడిరాజు, సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, అశాలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామభద్రపురం: మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని ఐసిడిఎస్ పిఒ వరహాలమ్మ తెలిపారు. మండల పరిధిలోని కొట్టక్కి గ్రామంలో సోమవారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, సర్పంచ్ అప్పికొండ అనురాధ, వైద్యాధికారి దిలీప్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రామభద్రపురం: గర్భిణులకు సీమంతాలు చేస్తున్న పిఒ

శృంగవరపుకోట: మండలంలో పెదకండేపల్లి గ్రామంలో స్వస్త్ నారీ స్వశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 109 మందికి వైద్య సేవలు అందించామని కొట్టం పిహెచ్‌సి డాక్టర్ హారిక, లావణ్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సంప్రదాయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బొబ్బిలి హృషీకేశ్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక శాంతినికేతన్ పాఠశాల ఆవరణలో సోమవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ మాట్లాడుతూ శుభ సందర్భాల్లో మొక్కలు నాటడం ఏళ్ళ నాటి పర్యావరణ సాంప్రదాయంగా పాటించాలన్నారు ఈ కార్యక్రమంలో సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, విశ్రాంత సహకార బ్యాంక్ మేనేజరు వి.నాగేశ్వర రావు, లగుడు సత్యం, మాజీ వార్డు సభ్యుడు బొబ్బిలి అప్పారావు, పాఠశాల కరస్పాండెంట్ యమ్.చిన్నబాబు, లాస్యశ్రీ, పార్వతి, రామలక్ష్మి, దేముడు తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు ఉపసంహరించుకోవాలి

సిఐటియు మండల మహాసభ డిమాండ్

ప్రజాశక్తి - జామిరూరల్

బిజెపి, ఆర్ఎస్ఎస్ తీసుకో చ్చిన పని గంటల పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సిఐటియు మండల మహాసభ డిమాండ్ చేసింది. కనకమహాలక్ష్మి, సత్యవతి, ఈశ్వర రావు అధ్యక్షతన స్థానిక ఎంపిపి స్కూల్ ఆవరణలో సోమవారం నిర్వహించిన సభకు ముఖ్య వక్తలుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. సుధారాణి, జిల్లా కోశాధికారి ఏ.జగన్మోహనరావు, వ్యవసా య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్. ముత్యాలు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికు లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ సమయంలో అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేశారని, ఆశా వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున 36 గంటలు నిరవధిక అధ్యక్షులు చేపట్టారని, విఆర్ఎ, గ్రీన్ అంబాసిడర్లు, ఆటో డ్రైవర్లు, పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని, ఆ సందర్భంలో ప్రతిపక్ష నేతగా ఉన్న కూటమి పెద్దలు మన ప్రభుత్వం వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, నేడు అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పైగా ఎనిమిది గంటల పని దినాన్ని 10 నుంచి 12 గంటలకు పెంచు తూ, మహిళలతో రాత్రిపూట పని చేయిం చుకునేందుకు అసెంబ్లీలో చట్ట సవరణ చేశారని తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సుధారాణి

9 మందితో మండల సమన్వయ కమిటీ

మండల కన్వీనర్‌గా బి.కనక మహాలక్ష్మి, కో కన్వీనర్‌గా ఎ.సత్యవతి, సభ్యులుగా ఎల్. శ్రీదేవి, ఎన్.సుగుణ, ఆర్. అప్పలరాజు, కోడి ఆనంద్, ఏ. ఈశ్వ రరావు, మరో ఇద్దరిని కో ఆప్షన్ సభ్య లుగా మొత్తం 9 మందిని ఎన్నుకున్నారు.

IN THE HONOURABLE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
E.P.162/2024 in O.S.78/2016

Between:
Sri Boni Narayanappadu ... Decree Holder
And:
Smt. Bagadi Manikyam ... Judgment debtor

NOTICE

Address of the Judgment debtor:
Bagadi Manikyam, W/o. Venkata Ramana, Business, House No: 83-A, Katta Veedhi Colony, Nalla Cheruvu Post, Vizianagaram Town, Vizianagaram District.

The decree holder filed the above E.P. for sell the E.P. schedule mentioned property for realization of the amounts due under the decree in the above suit and the above E.P. is posted to **09.10.2025 at 10:30 A.M.** before the above Honourable court either personally or through an Advocate duly authorized by you, if you fails to appear personally on **09.10.2025 at 10:30 A.M.** the matter will be decided in your absence basing on the material available on record.

K.B.Parameswara Rao
Advocate for the Decree Holder
Vizianagaram, Cell: 944073833

ప్రకటన
మహారాజశ్రీ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టు, విజయనగరం
F.D.I.A. 814/2024 O.S. 27/2021

Between :
Sri. Bimal Kumar Goyal .....Petitioner/Plaintiff
And :
1) Smt. Mamidi Vijaya Bhanu
2) Sri. Mamidi Vamsi Krishna
3) Kum. Mamidi Pujitha
4) Smt. Mamidi Sooramma ...Respondents

పై నంబరు కేసు F.D.I.A. 814/2024 O.S. 27/2021 మూడవ రెస్పాండెంటు కుమారి మామిడి పూజితకి కోర్టుద్వారా పంపిన సమన్లు పుచ్చుకోకపోవటం వలన కోర్టువారు పత్రికా ముఖంగా నోటీసు జారీ చేయమని ఆదేశించియున్నారు. కావున ఈ ప్రకటన ద్వారా కుమారి మామిడి పూజితకి తెలియజేయునది ఏమనగా పై నంబరు కేసు తేది 16-10-2025నకు మీకు నోటీసు పత్రికా ముఖంగా జారీ చేయు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున **తేది 16-10-2025 ఉదయం 10-30 గంటలకు** కోర్టులో మీరు వ్యక్తిగతంగా గాని లేదా న్యాయవాది ద్వారా వచ్చి గాని మీపై ఉన్న కేసుకు కోర్టులో సమాధానం చెప్పగలరని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. మీరు సదరు 16-10-2025న హాజరు కాని పక్షంలో మీరు గైరుహాజరుగా పరిగణించి కోర్టువారి ఉత్తర్వులకి లోబడి కేసు తదుపరి విచారణ జరుపబడునని తెలియజేయడమైనది.

Sri. J.K.Siva Ram,
Sri. K.V.R. Sastry,
Smt. N.Sri Latha
Advocates,
C/o Late K.V. Krishna Rao
Vakkalanka Vari Street,
Vizianagaram.